సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 6 । మార్చి । 2023



జాతరకు సన్నాహాలు

రెడ్డిగణపవరంలో మంగళవారం నుంచి జరిగే కనకదుర్గమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో



చేప అ'ధర'హో

చేపల ధరలు మూడు నెలలుగా క్రమంగా పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



విజిలెన్స్ దాడులు

ఉమ్మడి జిల్లాలో చేపలు, మటన్, చికెన్ దుకాణాల్లో తూకాల్లో వ్యత్యాసాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

మానవత్వం చాటిన ఎస్పీ



క్షతగాత్రుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

పాలకొల్లు సెంట్రల్: జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ విధి నిర్వహణలో మానవత్వం చాటారు. సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చించినాడ బైపాస్ రోడ్డు మీదుగా ఎస్పీ వాహనంలో వెళుతుండగా కాజ గ్రామం వద్ద బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లికి చెందిన పితాని సత్యనారాయణ అనే వ్యక్తి గాయాలపాలై పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న ఎస్పీ వాహనాన్ని నిలిపి క్షతగ్రాతుడిని తన వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరైన సమయంలో ఆస్పత్రికి తరలించడంతో క్షతగాత్రునికి మెరుగైన వైద్యం అందిందని స్థానికులు అంటున్నారు. మానవత్వం చాటిన ఎస్పీని అభినందించారు.

సీఎం జగన్ వెంటే నడుస్తాం




సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని సర్రాజు కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), యుగంధర్‌వర్మ (వర్మ) అన్నారు. సర్రాజు స్వగృహం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సర్రాజు మరణవార్త తెలిసిన వెంటనే హుటాహుటిన బయలుదేరి వచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సర్రాజుకు ముఖ్యమంత్రి ఇచ్చిన గౌరవానికి సదా రుణపడి ఉంటామని, సీఎం జగన్ ఏం చెబితే అది తప్పకుండా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే తమ కుటుంబానికి అండగా నిలిచిన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాల్, ఎంపీలు మిథున్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆళ్ల నాని, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తదితరులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుతో కలిసి ముందుకు సాగుతామన్నారు. తండ్రి సర్రాజు పేరున నియోజకవర్గ ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వేగేశ్న సూర్యనారాయణరాజు, మంతెన రాంకుమార్‌రాజు, రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల పేర్లతో హాల్‌టికెట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లావ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియెట్ థియరీ పబ్లిక్ పరీక్షల నిమిత్తం విద్యార్థులకు జారీ చేసే హాల్‌టికెట్లపై కొత్త జిల్లాల పేర్లు నమోదు చేసి ఇవ్వాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికన జరిగే పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఇప్పటికే కళాశాలల లాగిన్‌లో ఉంచామన్నారు. ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో విలీనమైన కళాశాలలకు చెందిన విద్యార్థుల హాల్‌టికెట్లపై ఆయా కొత్త జిల్లాల పేర్లను తెలిపే రబ్బర్ స్టాంప్ తయారు చేయించి వాటిని ముద్రించి కళాశాల ప్రిన్సిపాల్ అటెస్టేషన్ చేసి ఇవ్వాలని సూచించారు. కొత్త జిల్లా పేరు లేకుండా ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేసి ఉంటే తిరిగి కొత్త జిల్లా పేర్లు వేసి మరో హాల్‌టికెట్ ఇవ్వాలన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం బాండ్ అందిస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.1,11,116ను విరాళంగా అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా ఎనికేపాడు గ్రామానికి చెందిన మండవసాయి గణేష్, సాయి రూపేష్ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ అందించారు.











ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి కుమార్తె వివాహ వేడుకకు హాజరు





స్వాగతం పలుకుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీలు కోటగిరి శ్రీధర్, పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ లక్ష్మీ సింధూజ, డాక్టర్ అనిర్విణ్హా సూర్యసుబ్బరాజు వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పలువురు ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు కాజ గ్రామంలోని హెలీప్యాడ్ వద్ద హెలికాఫ్టర్ దిగిన సీఎం జగన్ యలమంచిలి మండలం కలగంపూడిలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి తిరిగి సాయంత్రం 5.29 గంటలకు తాడేపల్లి బయలుదేరి వెళ్లారు. హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రులు పేర్ని నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్, ఏపీఎస్‌డీఏ వైస్ చైర్మన్ వి.రఘురాం, డీసీసీబీ చైర్మన్ పీఎల్‌వీ నర్సింహరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనందప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బర్రి లీల, కార్పొరేషన్ల డైరెక్టర్లు బందన పూర్ణచంద్రరావు, మావూరి సత్యనారాయణ, పాలకొల్లు నేతలు యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, మేకా శేషుబాబు తదితరులు స్వాగతం పలికారు.

ఘనంగా వివాహ వేడుక

వివాహ రిసెప్షన్ వేడుక వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నాయకులు, వ్యాపార ప్రముఖులు హాజరయ్యారు. సుమారు 40 వేల మందికి వేదిక వద్ద భోజనాలు ఏర్పాటుచేశారు. తిరుమల, తిరుపతి ఆలయాల తరహాలో ఏర్పాటు చేసిన వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉత్సాహంగా ఉప్పు సాగు

మడి.. సందడి

- ఉప్పు సీజన్ ప్రారంభం
- కోటి ఆశలతో సాగు
- తీరంలో మడుల కళకళ
- పెరిగిన గిట్టుబాటు ధర

నరసాపురం: జిల్లాలోని నరసాపురం తీర ప్రాంతంలో ఉప్పు సాగు ఉత్సాహంగా మొదలైంది. ఇటీవల ఎండలు ముదరడంతో రైతులు సాగుకు ఉపక్రమించారు. గతేడాది వరుస విపత్తులు, అధిక వర్షాలతో నష్టాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది సాగుపై గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం తీర గ్రామాల్లో ఉప్పుసాగు విస్తారంగా జరుగుతోంది. అలాగే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉప్పుకు గిట్టుబాటు ధర పెరగడంతో రైతులు ఆనందంగా సాగు పనులు మొదలుపెడుతున్నారు. జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాల్లో ఉప్పు సాగు మొదలైంది.

ఆరు నెలల దిగుబడి

ఉప్పు సాగు కష్టంతో కూడుకున్నది. ఒక్కసారి మడి కడితే ఆరు నెలల పాటు ఉప్పు దిగుబడి వస్తుంది. ఏటా మార్చి నెలలో ఉప్పు సాగు సీజన్ ప్రారంభమవుతుంది. ఎకరాకు 60 నుంచి 70 మడులను కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తర్వాత సముద్రం నీటిని మడుల్లో నింపుతారు. సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు ఆరుగురి నుంచి పది మంది వరకు శ్రమిస్తేనే గాని ఉప్పు తయారుకాదు. ఎకరాకు పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోల వరకు ఉప్పు దిగుబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ఉప్పు గుట్టలు (ఫైల్)

మూడింతలు అ'ధర'హో

ఇటీవల ఉప్పుకు గిట్టుబాటు ధర పెరిగింది. ఏడాది క్రితం తీరంలో పండించే ఉప్పు బస్తా (50 కిలోలు)ను రైతుల నుంచి దళారులు రూ.100కు కొనేవారు. ప్రస్తుతం బస్తా ధర రూ.300 పలుకుతోంది. ధర మూడు రెట్లు పెరిగిందని, వాతావరణం అనుకూలిస్తే లాభాలు గడిస్తామని రైతులు అంటున్నారు. నరసాపురం తీరం నుంచి ఉప్పు ఆంధ్రా, తెలంగాణలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతుంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడి ఉండటంతో రైతులు ఉప్పు సాగుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏడాదికేడాది సాగు విస్తీర్ణం తగ్గుతోంది. పదేళ్ల క్రితం దాదాపు 15 గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగు ఉండేది.

నిల్వ మార్గం లేక..

ఉప్పును భద్రపరుచుకోవడానికి గిడ్డంగుల సదుపాయం లేదు. దీంతో రైతులు ఉప్పును ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. అకాల వర్షాలు, తుపానుల సమయంలో ఉప్పురాశులు ధ్వంసమై తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే ఉప్పుసాగుకు అధికార పంటగా గుర్తింపు లేకపోవడంతో ధ్వంసమైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాదు. బీమా వర్తించదు. ఉప్పుసాగును అధికార పంటగా గుర్తించాలని, సదుపాయాలు కల్పించాలని, గిడ్డంగులు ఏర్పాటుచేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.



జిల్లాలో తీర ప్రాంతం	19 కిలోమీటర్లు
ఉప్పు సాగు గ్రామాలు	8
ప్రస్తుతం సాగు విస్తీర్ణం	1,500 ఎకరాలు
ఏడాదికి ఉప్పు ఉత్పత్తి	2 వేల టన్నులు
ఆధారపడిన రైతులు	800 మంది
పరోక్షంగా ఉపాధి	2,000 మంది

వాతావరణం బాగుండాలి



ఏటా మార్చిలో ఉప్పు సాగుకు సీజన్ మొదలవుతుంది. గతేడాది జూన్, జూలైలో అధిక వర్షాలతో మడుల్లోకి నీరు చేరింది. దీంతో పండించిన ఉప్పును అయినకాడికి అమ్ముకున్నాం. దీంతో నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది వాతావరణం ఎలా ఉంటుందో చూడాలి.

– మైలా ఏడుకొండలు, ఉప్పురైతు, పీఎం లంక, నరసాపురం మండలం

రేటు పెరిగింది



ఉప్పు 50 కిలోల బస్తా ధర రూ.300 పలుకుతోంది. ఈ మధ్యనే అంతరేటు పెరిగింది. గతేడాది రూ.100 మించి ధర లేదు. చప్పనీటి ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడంతో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది లాభాలు వస్తాయనుకుంటున్నాం.

– పొన్నమండ రాంపండు, ఉప్పురైతు, తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ట్రిబ్యునల్



డాక్టర్ కామిల్ జామ, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారని ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ డాక్టర్ కామిల్ జామ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రజల కష్టాలు, కన్నీళ్లను స్వయంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు ట్రిబ్యునల్‌ను కర్నూలులో ఏర్పాటు చేశారని తెలిపారు. ట్రిబ్యునల్ చైర్మన్‌గా జి.భూపాల్‌రెడ్డిని నియమించటం ద్వారా ఆస్తి తగాదాల పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు. పేద ముస్లింల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన వక్ఫ్ ఆస్తులను రక్షించటంలో గత టీడీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత పాలకుల హయాంలో ఐదేళ్లపాటు ముస్లింలు గుర్తు రాలేదనీ, ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చేయకుండా, జిల్లా అధ్యక్షులను నియమించకుండా వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాజేసేందుకు టీడీపీ నాయకులు పన్నాగం వేశారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ముస్లింల బాధ్యతగా గుర్తించాలన్నారు. ముస్లింలంతా సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

చెట్టంతా.. ఆశల పూత



సంవత్సరాదికి నిండా పూతతో మామిడి చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. ఆకు కూడా కనిపించనంతగా విరబూసిన పూతతో ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని దొరసానిపాడులో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ మామిడి చెట్టు ఇలా కనువిందు చేస్తోంది.

– ద్వారకాతిరుమల

కొల్లేటి తీరాన.. పెద్దింట్లమ్మ నామస్మరణ

జాతరకు పోటెత్తిన భక్తజనం



క్యూలైన్లలో భక్తులు

కైకలూరు: కొల్లేటికోట భక్తజన సంద్రాన్ని తలపించింది.. పెద్దింట్లమ్మ నామస్మరణ మార్మోగింది. అమ్మవారి జాతర వైభవంగా జరుగుతోంది. ఆదివారం సుమారు 25 వేల మందికిపైగా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి చేరే సర్కారు కాల్వ వంతెన వద్ద వాహనాల రద్దీ పెరిగింది. ఉదయం అమ్మవారికి అష్టాదశ కలశర్చన, అష్టాదశ పూజ, పత్ర సాధన హోమం, బలిహరణ, పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, హారతి, మంత్రపుష్ప సమర్పణ వంటి పూజాదికాలు జరిగాయి. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణకు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు దంపతులు (అయి భీమవరం) సహకరించారు. దేవస్థానం వద్ద కోలాట ప్రదర్శన, ఘంటసాల గాన సుధ పాటల కచేరీ ఆకట్టుకుంది. జాతరలో చివరి రోజు కోనేరులో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ కేవీ గోపాలరావు తెలిపారు.

పొంగళ్లు సమర్పణ

కోనేరు వద్ద జల్లు స్నానాలు చేసిన భక్తులు పొంగళ్లు సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సీఐలు వైవీవీఎల్ నాయుడు, ఎంవీఎస్ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్డీఓ పెంచెల కిషోర్ అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయ పరిసరాల్లో..



పెద్దింట్లమ్మ తల్లి

నిలిచిన గూడ్సు.. స్తంభించిన రాకపోకలు

ఉండి: ఉండి రైల్వే గేట్ వద్ద ఆదివారం అనివార్య కారణాలతో ఆకివీడు వైపు నుంచి వస్తున్న గూడ్సు రైలు నిలిచిపోగా అరగంట సేపు గేటు తెరవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి రైల్వేగేటు వద్ద గూడ్సురైలు నిలిచిపోవడంతో గేటు తెరవలేదు. దీంతో భారీగా వాహనాలు స్తంభించాయి. ఈ ప్రాంతంలో రెండేళ్లుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ దశలో ఉందని, ఇది పూర్తయితే తమకు ఇబ్బందులు ఉండవని ప్రయాణికులు అంటున్నారు. తరచూ గేటు పడుతుండటంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెంటపాడు: దర్శిపర్రు గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కొత్త ఇల్లు కట్టు కుంటున్న పంతం ధర్మారావు(54) ఆదివారం సాయంత్రం విద్యుత్ మోటార్ వేసి గోడలు తడుపుతున్నాడు. అనుకోకుండా ప్రమాదవ శాత్తూ మోటార్‌కు విద్యుత్ ప్రవహించినట్లు స్థానికులు తెలిపారు. ధర్మారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలోని పలువురు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గాల ఎంపిక


పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కమిటీ

ఉంగుటూరు: పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నారాయణపురంలో నిర్వహించారు. సమతా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోషియన్ భవనంలో ఎంపిక జరిగింది. స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి నరేంద్ర బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కమిటి చైర్మన్‌గా మానేపల్లి శ్రీనివాసరావు, ప్రెసిడెంటుగా చింతకాయల సత్యనారాయణ, కార్యదర్శిగా సంకు సూర్యనారాయణ, ట్రెజరర్‌గా కటికితల బాబూరావు ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా చైర్మన్‌గా ఆదిరెడ్డి సత్యనారాయణ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా గుల్ల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా దేవరపల్లి ప్రసాదు, ఎన్నికయ్యారు.

ఏజెన్సీలో అతిపెద్ద జాతరకు సన్నాహాలు


అన్నపూర్ణా దేవి


కనకదుర్గమ్మ


రెడ్డి రాజుల కాలంలో నిర్మించిన కల్యాణ మండపం


కనకదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు (ఫైల్)

- మార్చి 7 రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ జాతర
- 900 ఏళ్ల నాటి దేవాలయం

బుట్టాయగూడెం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా రెడ్డి రాజుల కాలం నుంచి ఏజెన్సీ ప్రాంతమైన రెడ్డిగణపవరంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర కనకదుర్గమ్మ భక్తుల పూజలందుకుంటోంది. 900 సంవత్సరాల క్రితం రెడ్డి రాజులు నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం హోలీ పూర్ణిమ నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు జరుగుతాయి. ఏజెన్సీలో పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలే కాకుండా కృష్ణా, పశ్చిమ, తూర్పు, ఖమ్మం జిల్లాల భక్తుల ఆరాధ్య దైవంగా అమ్మవారు నీరాజనాలు అందుకుంటోంది. ఈ ఏడాది మార్చి 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. దుర్గమ్మకు వరాలు ఇచ్చే తల్లిగానే కాకుండా సంతానం కలిగించే అమ్మగా పేరుంది. ఉత్సవాలు జరిగే అయిదు రోజులు సంతానం లేని వారు ఉపవాసంతో దుర్గమ్మను పూజిస్తే సంతానం కలుగుతుందని విశ్వసిస్తారు. సంతాన ప్రాప్తి కోసం ఎక్కువ మంది మహిళలు ఈ ఉత్సవాలకు వస్తుంటారు.

గణపతిరెడ్డి విజయాలకు గుర్తుగా

ఈ ఆలయాన్ని రెడ్డి రాజుల పాలనలో గణపతి రెడ్డి 1110వ సంవత్సరంలో నిర్మించారని, రెడ్డి రాజు గణపతిరెడ్డి దేవాలయాన్ని నిర్మించి పాలించడం వల్ల ఈ ప్రాంతానికి రెడ్డి గణపవరం అనే పేరు వచ్చిందని ఆలయ ధర్మ కర్త భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు. గణపతి రెడ్డి తమ విజయాలకు గుర్తుగా ఈ ఆలయాన్ని నిర్మించారని, పాశ్చాత్యాంశాలల్లో రెడ్డి రాజుల పాలన విషయాలు, దేవాలయ అంశం ఉందని ఆయన తెలిపారు. రెడ్డి రాజుల కాలంలో నిత్యం ధూప దీప నైవేద్యాలతో భక్తుల నీరాజనాలు అందుకున్న దుర్గమ్మ దేవాలయం 1415లో జరిగిన ముస్లింల దండయాత్రలో ధ్వంసమైందని ధర్మ కర్త తెలిపారు. ముస్లింల దాడులలో ఆలయం తోపాటు విగ్రహాలు కూడా ధ్వంసమయ్యాయని రెడ్డి రాజుల చరిత్రలో ఉందని తెలిపారు. 1925వ సంవత్సరంలో తమ పూర్వీకులు భౌమరాజు రామకృష్ణంరాజు శిథిలమైన ఈ దేవాలయాన్ని తిరిగి పునరుద్ధరించారని, ఆ నాటి నుంచి నేటి వరకూ హోలీ పూర్ణిమ రోజు నుంచి ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు:

కనకదుర్గమ్మ తల్లి ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు వచ్చి వారి మొక్కులు తీర్చుకుంటారు. దుర్గమ్మ ఉత్సవాలు ఏజెన్సీ ప్రాంతంలో ఐదు రోజులు ఘనంగా జరగడమే ప్రత్యేకత. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఆలయ కమిటీ యువజన సంఘం ఆధ్వర్యంలో కమిటీలుగా ఏర్పడి పోలీసుల సహకారంతో చర్యలు చేపడతారు. ఈ ఉత్సవాలు ఈ నెల 7వ తేది నుంచి 11 వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు భౌమరాజు సత్యనారాయణరాజు, భౌమరాజు ధనుంజయరాజులు తెలిపారు.

ఉత్సవాలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు



ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా కనకదుర్గమ్మ వారికి పేరు ఉండడంతో లక్షల్లో భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల్లో ఎలాఈంటి అసౌకర్యాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నాం.

– భౌమరాజు సత్యనారాయణరాజు, ఆలయ ధర్మకర్త–రెడ్డి గణపవరం

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు



ఉత్సవాలు జరిగే 5 రోజుల్లో భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తిరుణాళ్లు జరిగే ప్రదేశంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు మంచినీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– అల్లూరి రత్నాజీరావు, ఉత్సవ కమిటీ చైర్మన్– రెడ్డిగణపవరం.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలి మృతి


తిరుమలదేవిపేటలో దగ్ధమవుతున్న ఇల్లు

టి.నరసాపురం: అగ్నిప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో రోడ్డుపక్కన తాటాకింట్లో ఉంటున్న అనగాని అంకమ్మ(63) ఆదివారం 10 గంటల సమయంలో గ్యాస్ స్టవ్‌పై టీ కాస్తుండగా, ప్రమాదవశాత్తు ఆమె చీరకు నిప్పంటుకుంది. మంటలు వ్యాపించి ఇల్లు కూడా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు తీవ్రంగా గాయపడిన అంకమ్మను బయటకు తీసుకువచ్చి 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు


రెస్టారెంట్ నుంచి ఎగిసి పడుతున్న మంటలు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి సత్రం సెంటర్ సమీపంలోని ఎస్.ఎస్.రెస్టారెంట్ హోటల్‌లో గ్యాస్ పైప్‌లైన్ దగ్గర గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రెస్టారెంట్‌లోని మెగా గ్యాస్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకవడంతో మంటలు భారీగా చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందారు. పైప్‌లైన్‌కు వచ్చే గ్యాస్‌ను నిలిపివేయడంతో మంటలు తగ్గాయి.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 7731 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో ఆదివారం 7,731 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుల్లో జరిగిన పరీక్షకు 79 కేంద్రాల్లో 6094 మంది హాజరు కావాల్సి ఉండగా 5983 మంది హాజరయ్యారు. మరో 111 మంది గైర్హాజరయ్యారు. 28 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 1929 మంది హాజరు కావాల్సి ఉండగా 1748 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి


మృతుడు రామారావు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారి సమీపంలో ఆటోనగర్ ప్రాంతంలో రైలునుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు ఆటోనగర్ ప్రాంతంలో రైలు పట్టాలపై మృతదేహం లభించిందని తెలిపారు. గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు విజయనగరం జిల్లా తెర్లం గ్రామానికి చెందిన గుంట రామారావు (58)గా గుర్తించామని తెలిపారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఒక వ్యక్తి అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని దొంగపిండి గ్రామానికి చెందిన తిరుమాని శ్రీనివాస్ (36) మద్యానికి బానిసై దొరికిన కాడికల్లా అప్పులు చేశాడు. ఈ నెల 3న పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను బంధువులు భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం శ్రీనివాస్ ఆరోగ్యం క్షీణించడంతో మృత్యువాత చెందాడు. తండ్రి తిరుమాని లక్ష్మణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గొల్లవానితిప్పలో శీలావతి చేపలు పడుతున్న దృశ్యం


ఫంగస్ చేపలు పడుతున్న దృశ్యం

చేప అ'ధర'హో

- కిలో శీలావతి రూ. 114
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు

భీమవరం అర్బన్: ఆక్వా హబ్‌గా పేరొందిన జిల్లాలో చేప ధర గత మూడు నెలలుగా క్రమంగా పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భీమవరం మండలంలోని వెంప, కొత్తపూసలమర్రు, తోకతిప్ప, నాగిడిపాలెం, దొంగపిండి, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, కొమరాడ, అనాకోడేరు, ఎల్‌వీఎన్‌పురం గ్రామాలలో సుమారు 17 వేల ఎకరాలలో చేపలు, రొయ్యల పెంపకం సాగిస్తున్నారు. ప్రధానంగా శీలావతి, కట్ల చేపల పెంపకం సాగిస్తుండగా రూప్ చంద్, ఫంగస్, తిలాఫీ, గడ్డి చేప, మోస్ తదితర సప్పనీటి చేపలను పెంచుతున్నారు. ప్రస్తుతం కేజీ శీలావతి, కట్ల మార్కెట్‌లో రూ.114 ధర పలుకుతుంది. చేపల టన్నేజి ఆధారంగా కిలో శీలావతి, కట్ల ధరలు కిలో కంటే ఎక్కువగా ఉంటే రూ.116కి కొనుగోలు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా శీలావతి పెంపకం చేస్తున్నప్పటికీ ఫంగస్ రూ.79, రూప్‌చంద్ రూ.105, గడ్డిచేప రూ.95, జాడ్‌మోసు రూ.98 వరకు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

చేపల పెంపకంపై రైతులు మొగ్గు

మార్కెట్‌లో చేపలకు గిరాకీ ఉండటంతో రైతులు చేపలను పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు. వనామీ రొయ్యలకు చలి తీవ్రత కారణంగా వైరస్ రావడం సాగులో నష్ట శాతం ఎక్కువగా ఉంది. దీంతో సన్న, చిన్న కారు రైతులు చేపలను పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు.

చేప ధర ఇలాగే కొనసాగాలి



చేపలకు మేతలు, కూలీల ఖర్చులు పెరిగి పోయాయి. చేప ధరలు ఇలా కొనసాగితేనే సన్న, చిన్నకారు రైతులు చేపలను పెంచుతారు. ఒక్కొక్కసారి చేపల ధరలను తగ్గించడంతో నష్టాలు వస్తున్నాయి. చేప ధరలు పెంచి స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

పెనుమాల నరసింహస్వామి,
ఆక్వా రైతు, గొల్లవానితిప్ప

ఎగుమతులు పెరుగుతున్నాయి



గత మూడు నెలల నుంచి చేప ధరలు పెరుగుతున్నాయి. శీలావతి, కట్ల రూ.116కి చేరింది. గత రెండేళ్ల క్రితం కరోనా ప్రభావం చేపల సాగుపై తీవ్రంగా ప్రభావం పడింది. ఈశాన్య రాష్ట్రాలలో చేపల కొరత ఏర్పడింది. దీంతో మార్కెట్‌లో ధర పెరిగి. గత ఆరు నెలలుగా చేప ధరలు స్థిరంగా ఉన్నాయి.

ఎల్‌ఎల్‌ఎన్ రాజు, మత్స్యశాఖ ఏడీ, భీమవరం

గో సమ్మేళనాన్ని విజయవంతం చేయండి


ద్వారకాతిరుమల మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

ద్వారకాతిరుమల: ఈనెల 17 నుంచి 19 వరకు ద్వారకాతిరుమల మార్కెట్ యార్డులో నిర్వహించనున్న గోసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి కోరారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మార్చి 17, 18, 19 తేదీల్లో ఒంగోలు ఆవులు, గిత్తలు, పుంగనూరు ఆవులు, గిత్తల అందాల పోటీలు, అలాగే ఒంగోలు ఆవుల పాలపోటీలను నిర్వహించనున్నారు. ఒంగోలు, పుంగనూరు ఆవులు, గిత్తలను వివిధ కేటగిరీలుగా విభజించి పోటీలు జరుపుతామని, అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. పోటీలు జరిగే మూడు రోజులు గోఆధారిత వ్యవసాయంపై నిపుణులచే అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను గుర్తించి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు.

గాలాయ గూడెం వెళ్ళి పింఛన్ అందజేత


గాలాయగూడెంలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు, గృహ సారథి

ముసునూరు: మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ఉప్పే దుర్గ ఏలూరులోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది, గాలాయగూడెంలోని కుమార్తె ఇంటివద్ద ఉంటుంది. ఆమె తన స్వగ్రామానికి వచ్చి పింఛన్ అందుకోలేని పరిస్థితి. దీంతో గ్రామ వలంటీరు దగ్గుమల్లి షేబారాణి, గృహసారథి సుధీర్‌బాబుతో కలసి ఆదివారం గాలాయగూడెం వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీరు కర్తవ్య నిర్వహణను జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, ఎంపీటీసీ కొండా దుర్గాభవాని తదితరులు అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు రూ.47,390 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో ఈ దాడి నిర్వహించినట్లు చెప్పారు.

ద్వారకాతిరుమల : మండలంలోని ఎం.నాగులపల్లిలో ఒక పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్ర పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 5 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,200 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

కోడిపందేలపై దాడి

పెదవేగి: పెదవేగి మండలం వేగివాడలో కోడి పందేలపై ఆదివారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని 3 కోడి పుంజులు, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. న్యాయంపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.1000 స్వాధీనం చేసుకున్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన వ్యక్తి కుమార్తె భాస్కర్ ట్రావెల్స్‌లో పనిచేస్తుంది. ఈ నెల 4న జాబ్‌కు వెళుతున్నట్లు చెప్పి తిరిగి రాలేదు. భాస్కర్ ట్రావెల్స్‌కు ఫోన్ చేయగా, యువతి ఆఫీస్‌కు రాలేదని తెలిపారని, తనకు భాస్కర్ ట్రావెల్స్ యజమానిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు.

తూకాల్లో తేడాలపై విజిలెన్స్ దాడులు


ఏలూరు వన్‌టౌన్ మార్కెట్‌లో చేపల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని చేపలు, మటన్, చికెన్ దుకాణాల్లోని తూకాల్లో వ్యత్యాసాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. ఆదివారం రెండు జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో దుకాణాలపై తనిఖీలు చేపట్టి, తూకాల యంత్రాలను పరిశీలించారు. ఏలూరు నగరం, భీమవరం పట్టణంలో ఇష్టారాజ్యంగా దుకాణదారులు తుకాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఏలూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు పలు చోట్ల దాడులు చేశారు. ఏలూరులోని చేపల మార్కెట్‌లో సుమారు 20 దుకాణాలపై విజిలెన్స్ ఎస్ఐ నాగరాజు, అధికారులు తనికీలు చేశారు. తుకాల్లో వ్యత్యాసాలను గుర్తించిన అధికారులు, స్టాంప్‌లేని తూకం యంత్రాలను 11 ఉన్నట్లు నిర్ధారించారు. వీటిని దుకాణదారులు వినియోగించటంతో తూకంలో వ్యత్యాసాలు వస్తున్నాయని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సుమారుగా 36 మటన్, చికెన్, రొయ్యలు, చేపల దుకాణాల్లోని తూకాలను తనిఖీ చేశారు. కేసులు నమోదు చేశారు. తుకాల్లో మోసాలకు పాల్పడితే చట్టం మేరకు చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ హెచ్చరించారు.

శ్రీవారి క్షేత్రంలో 22న ఉగాది వేడుకలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఈనెల 22న శుభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీవారి ప్రధాన ఆలయంతో పాటు, ఉత్సవం జరిగే ఉగాది మండపాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారు ఆలయం నుంచి ఉభయ దేవేరులతో కలసి వెండి శేషవాహనంపై ఉగాది మండపం వద్దకు ఊరేగింపుగా తరలివెళతారన్నారు. అక్కడ పంచాంగ శ్రవణం తరువాత పండిత సత్కారం జరుగుతుందన్నారు. అనంతరం శ్రీవారికి గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

పాలకోడేరు: చేపలచెరువు ఆవల ఉన్న పడవ తెచ్చుకునేందుకు ఈత కొట్టుకుంటూ వెళ్ళి ప్రమాదవశాత్తు మునిగి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం మైప వడ్డిగూడెం గ్రామంలో గాదిరాజు సుబ్బరాజు కు చెందిన చేపల చెరువులో ఒడిశాకు చెందిన కొలాక సుందరరావు(21) రెండు నెలల నుంచి పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయం లో చెరువులో మేత వేసేందుకు చూడగా పడవ చెరువు ఆవల ఉండటం తో దాన్ని తెచ్చుకునేందుకు చెరువులో ఈదుకుంటూ వెళ్ళాడు. సగం దూరం వెళ్ళేటప్పటికి యువకుడు మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి చెరువు లోకి వెళ్లి బయటకు తీయగా అప్పటికే ఊపిరి ఆడక మృతిచెందాడు. సూపర్‌వైజర్‌గా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన వడ్డి రఘురామ్



ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వడ్డి రఘురామ్

తాడేపల్లిగూడెం (టీటీసీ): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం కలగంపూడిలో హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకుడు వడ్డి రఘురామ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ సింధూజ, డాక్టర్ అనిర్విణ్ణ సూర్యసుబ్బరాజు వివాహ మహోత్సవ కార్యక్రమంలో వడ్డి రఘురామ్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి

తాడేపల్లిగూడెం రూరల్: సమాజ ఆరోగ్యంతోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హర్ష అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేన్సర్‌పై సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌వో సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ విరోనిక, ఫార్మసిస్ట్ రామారావు, హెచ్‌వీ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంచార వైద్య సేవ

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 20 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు బొండాడ వెంకటేశ్వర్లు వైద్య సేవలందించి, సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా రోగులకు అందజేసినట్లు తెలిపారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



విశాఖపట్టణంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

తణుకు: విశాఖపట్టణంలో ఉంటున్న వృద్ధురాలి వద్దకు గ్రామ వలంటీర్ ఆదివారం వెళ్లి ఆమెకు పింఛను అందజేశారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రుకి చెందిన అందుకూరి మారమ్మ ఇటీవలి గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని విశాఖపట్టణంలోని తన కుమార్తె వద్ద ఉంటున్నారు. వలంటీర్ కె.దుర్గ వైజాగ్ వెళ్లి పింఛను మారమ్మకు అందజేశారు.

నేత్ర, దంత వైద్య శిబిరాలు

అత్తిలి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాలూరు సహకార సంఘం ఆర్థిక సహకారంతో అత్తిలి మండలం కొమ్మరలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలను ఆదివారం నిర్వహించారు. పాలకొల్లు ఆర్ఆర్ లయన్స్ కంటి ఆసుపత్రి, భీమవరం విష్ణు డెంటల్ కళాశాల సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో 104 మందికి వైద్య పరీక్షల చేసి 38 మందికి ఆపరేషన్లు, 47 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 63 మందికి దంత పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీటీకే ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, ఉపసర్పంచ్ మన్యం దానారావు, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మదనగోపాలుడి ఊరేగింపు

- పొన్నవాహనంపై స్వామి,అమ్మవార్ల దర్శనం
- గ్రామోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా బాణ సంచా కాల్పులు

అత్తిలి: బల్లిపాడు శ్రీరుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పొన్నవాహన గ్రామోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పొన్నవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి, పలుబ్యాండు మేళాలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్ డప్పుల బృందంతో నృత్య ప్రదర్శన, కాళికా మహంకాళిక శక్తివేషాలతో నృత్య ప్రదర్శనలు, సన్నాయిమేళం నడుమ స్వామివారి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, పొన్నవాహనం గ్రామోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తణుకు సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై సీహెచ్‌కే స్వామి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి చందక దారబాబు, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఆకుల పండుస్వామి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ ఆకుల బులినాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు పాల్గొన్నారు.

దువ్వలో వేణుగోపాల స్వామి పొన్న వాహనోత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి పొన్న వాహనోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన చిన్న గరుడ, పెద్ద గరుడ, ఆంజనేయ, గజ, నంది వాహనాలపై స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో వివిధ ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్రా ధనరాజు, దండు కృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ దుర్గ శివాజీ, ఈవో పీ సూర్యనారాయణ, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పొన్నవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



దువ్వలో పొన్న వాహనంలో ఊరేగుతున్న వేణుగోపాల స్వామి

అన్ని విధాలా సౌకర్యవంతంగా మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో మిర్చి అమ్మకాలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ

తాడేపల్లిగూడెం రూరల్: వరి సీజన్‌లో వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి, మిర్చి సీజన్‌లో మిర్చి విక్రయాలకు అన్ని విధాలా మార్కెట్ యార్డు సౌకర్యవంతంగా ఉంటుందని ఏఎంసీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ అన్నారు. ఆదివారం మండలంలోని పడాల మార్కెట్ యార్డులో మిర్చి అమ్మకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటకు మంచి ధర వచ్చిన తర్వాత విక్రయించుకోవడానికి వీలుగా గోదాములు ఉన్నాయన్నారు. అపరాలు నిల్వ, విక్రయాలకు అనువుగా ఉంటుందన్నారు. రైతులు తాము పండించిన మిర్చి పంటను మార్కెట్ యార్డు లో విక్రయించి మంచి ధర పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏఎంసీ డైరెక్టర్లు కోడే సత్యశ్రీనివాసరావు, షేక్ మహ్మద్ షఫీవుర్ రెహ్మాన్, సూపర్‌వైజర్ వి.గోపాలకృష్ణ, సిబ్బంది బి.అప్పారావు, కమీషన్ వ్యాపారి కళ్యాణం రామచంద్రరావు పాల్గొన్నారు.

క్రీస్తుకు విధేయులై జీవించాలి

పెంటపాడు: క్రీస్తుకు విధేయులై విశ్వాసులు జీవించాలని పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు కొమ్మిశెట్టి ఆమ్మాజీ పేర్కొన్నారు. జట్లపాలెం కోడూరి బాబ్జి స్థలంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రీస్తు సువార్త స్వస్థత సభలను ఆమె ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద కార్మికులు నిరసన

తాడేపల్లిగూడెం (టీటీసీ): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలోని తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు కార్యాలయంలో వర్కర్స్ యూనియన్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనకు యూనియన్ అధ్యక్షుడు సత్తి కోదండ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, నాయకులు తేతలి నాగిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ పెరుగుదలవల్ల సామాన్యులు, పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్‌వీఎస్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, జి.వెంకట్రావు, గూడ్స్ షెడ్డు యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

పేరిచర్లకు ఉత్తమ లయన్ యాక్టివ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ అడ్మిన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు బెస్ట్ లయన్ యాక్టివ్ అవార్డు అందుకున్నారు. ఆకివీడులో నిర్వహించిన అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 316జి జిల్లా రీజియన్ 4 సదస్సులో రీజనల్ మీట్ నిర్వాహకులు ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. రీజియన్ పరిధిలో లయన్స్ క్లబ్ టీంలు పాల్గొన్నాయి. కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు, జిల్లా గవర్నర్ డాక్టర్ పంకజాక్షన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. పేరిచర్ల మురళీకృష్ణంరాజును జిల్లా సభ్యులు గట్టిం మాణిక్యాలరావు, కాకర్ల వేణుబాబు, సీహెచ్ కృష్ణంరాజు, డైమండ్స్ తాడేపల్లిగూడెం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ బ్యానర్ ప్రజంటేషన్‌లో 3వ బహుమతి, బెస్ట్ అధ్యక్షుడు కోనా హనుమాన్‌ను ఎంపిక చేశారు.

సత్సంగం ద్వారానే ఆధ్యాత్మిక వృద్ధి

పెంటపాడు: భక్తుల సత్సంగం ద్వారానే ఆధ్యాత్మిక అభివృద్ధి సాధ్యమని భక్తి చైతన్యవైదిక నిర్వాహకులు డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పరిమెళ్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం చేసారు. భగవంతుని సేవలో తరించి మోక్షం పొందేందుకు సత్సంగం ప్రత్యేక మార్గమన్నారు. ప్రతి ఆదివారం ఆలయంలో విధిగా సత్సంగం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధ్యానం సర్వరోగ నివారిణి

అత్తిలి: ధ్యానం ద్వారా అన్ని రోగాల నుంచి బయటపడవచ్చని తణుకుకు చెందిన పిరమిడ్ మాస్టర్ బి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అత్తిలి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకుని సుఖమైన జీవితాన్ని గడపాలన్నారు. నిర్వాహకులు మాణిక్యాలరావు, బేతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

(APPENDIX-IV) **స్వాధీనత నోటీసు**

[illegible]

తేది : 28.02.2023

అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

వాకర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ గ్రౌండ్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కురుమళ్ళ వెంకటాచలం నేతృత్వం వహించారు. ప్రధాన కార్యదర్శి పి.కుమారస్వామి మాట్లాడుతూ ప్రతిరోజు వాకర్స్ గ్రౌండ్‌లో ఉదయం, సాయంత్రం సుమారు 300 మందికి పైగ పాదచారులకు వాకర్స్ ట్రాక్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ట్రాక్‌లోని చెత్త చెదారాలను, వ్యర్థాలను తొలగించినట్లు వెల్లడించారు. డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు దూలం నాగరాజు, చీఫ్ కోఆర్డినేటర్ కూచిపూడి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు కడియాల పరశురామయ్య, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, మేడిది యోహాను, సుధాకర్, కంచర్ల లక్ష్మీనరసింహం రామోజు వీరబ్రహ్మం, జగన్నాథరాజు, కర్రి వీరారెడ్డి, కుంట్ల రామ్మోహనరావు పాల్గొన్నారు.

వేల్పూరులో ఘనంగా కాటి పాపమ్మ జాతర



వేల్పూరు కాటి పాపమ్మ జాతరలో భాగంగా నిర్వహించిన కావిళ్ల ఉత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరులో ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే కాటి పాపమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం భక్తులు అమ్మవారికి సుమారు 180 కావిళ్ల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సునంద, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి హైమా, శ్యామల, విజయ దుర్గ, శేషుకుమారి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

తేది: 04-03-2023